# పనిమనిషాయ నమః

'ఋణానుబంధ రూపేణా పశు, పత్ని, సుత, ఆలయ' అనేది ఆధ్యాత్మిక సిద్ధాంతం. అందులో నిజానిజాలెలా వున్నా ఈ పనిమనిషి అనే శాల్తీ మనల్ని ఋణవిముక్తుల్ని చెయ్యడానికి అవతరించిన కారణ జన్మురాలనడానికి సందేహం లేదు. గత ఎనిమిది సంవత్సరాలలోనూ, ఇప్పుడు మా యింట్లో వెలసిన సత్తెమ్మ తొమ్మిదో అవతారం. బీరువాలోంచి నా బట్టలు మాయమవ్వడం, వాటి స్థానే యింట్లో రకరకాల స్టీలు సామాన్లు ప్రత్యక్షమవడం మా ఆవిడ అర్థికశాస్త్ర పాండిత్యాన్ని బట్టి జరుగుతుంటే అవి మా పనిమనిషి దివ్యసంకల్పానుసారం అదృశ్యమవుతూండటం పరిపాటయింది. పోయిన ప్రతి వస్తువుకీ మాకు ఋణం తీరిపోయిందని తిలోదకాలివ్వడం కూడా అలవాటైపోయింది.

ఇంటికొచ్చి అరగంటయినా కాఫీ రాకపోవడం చూసి మూడోసారి ఆర్త నాదం చేశాను. "తెచ్చేలోగానే అంత తొందరేమిటండీ? నాకున్నవి రెండే చేతులు, అంట్లు తోమడంలోనే అవి సగం అరిగిపోయాయి" అంటూ కాఫీ కప్పుతో ప్రత్యక్షమైంది మా ఆవిడ.

"కేజువల్లీవా? ఎరన్డ్ లీవా? డిస్మిసలా?" అడిగేను.

"పన్లోంచి మాన్పించేసి పొమ్మన్నాను. సత్తెమ్మ ఎంత రభస చేసిందను కున్నారూ? దానికి వన్‌మన్త్ నోటీసివ్వాలట లేకపోతే నెల జీతం ఏభై రూపాయిలు యిమ్మని ఒకటే అర్పులూ పెడబొబ్బలూను. ప్రాణం విసిగి యాభై రూపాయిలూ దాని మొహాన్న కొట్టి పొమ్మన్నాను" అంది.

"ఏం జరిగిందీ?"

"ఇల్లు కాలిపోయిందని చెప్పి నాలుగు రోజులు పనిలోకి రాకుండా మొన్నొచ్చి ఏడిస్తే రెండు చీరలూ, దుప్పటీ, ఇంకేవో గుడ్డ ముక్కలూ, ముప్పయి రూపాయిలూ యిచ్చి ఓదార్చేను. మొన్ననగా పట్టుకెళ్ళిన పులుసు గిన్నె యింతవరకూ తేలేదు. మధ్యాన్నం రాజలక్ష్మిగారింటి కెడితే తెలిసింది.

నెల్లాళ్ళ క్రితం యిల్లు కాలిపోయిందని చెప్పి, వాళ్ళ దగ్గరా యిలాగే డబ్బు, బట్టా పాతా గుంజుకుందిట!''

''దానికి రెండిళ్ళున్నాయేమో?'' అన్నాను పరధ్యానంగా.

''రెండు కాదు పద్నాలుగున్నాయి! ఇంత పచ్చి అబద్ధాలాడతావా అని నిలదీసి అడిగితే 'అబద్ధమాడక ఏం జెయ్యమంటారు! ఈ నౌకిరీ కేమైనా సెలవ లిత్తారా బోనసులిత్తారా!' అని అంటుంది చూడండి.''

''పులుసు గిన్నె తిరిగి ఇచ్చేసిందా?''

''అసలలాంటి గిన్నే తను తీసికెళ్ళలేదందండి'' అంది, యింక కన్నీరే తరువాయన్నట్టు, బిక్క మొహం పెట్టి.

మా కాలనీలో పనిచేసే పనిమనుషులందరికీ ఓ ప్రత్యేకమైన కోడ్ ఆఫ్ కాండక్ట్ వుంది. కొత్తవాళ్ళ నెవళ్ళనీ ఈ కాలనీకి రానివ్వరు. ఓ మనిషి మానెయ్యగానే మరో మనిషి కాస్త బెట్టుచేసి పది రూపాయిలెక్కువ మీద చేరు తుంది. ఇల్లు మారినప్పుడల్లా ఆ విధంగా వాళ్ళకి అయిదో పదో ఇంక్రిమెంటుం టుంది. ఒక్కొక్కప్పుడు ''పాపం! అదే నయం'' అనిపించి వెనక పనిచేసి మానేసిన పనిమనిషినే మళ్ళీ పెట్టుకోడం కూడా కద్దు. ఉదాహరణకి యల్లమ్మ మా యింట్లో 1975 ఫిబ్రవరి నుంచి 1976 మార్చి వరకూ నెలకు యిరవై రూపాయిల మీద, 1978 జూలై నుంచి 1979 నవంబరు వరకూ ముప్పయి అయిదు రూపాయల మీదా, 1981 ఏప్రియల్ నుంచి 1982 అగస్టు వరకూ నలభయ్యాయిదు రూపాయిల మీదా పన్జేసింది. ఇప్పుడు లేటెస్ట్ స్టార్ సత్తెమ్మకి నెలకి యాభై యిస్తున్నాం.

వీళ్ళని సంస్కరించి, వీళ్ళలో నైతిక పరివర్తన తీసుకురావాలన్న సదా శయంతో మా కాలనీలో వున్న మహిళామండలి వాళ్ళు వీళ్ళకోసం ప్రత్యేకంగా ఓ వయోజన విద్యా శిబిరం నడుపుతూ-వాళ్లకి అక్షర జ్ఞానంతోపాటు లెక్కలూ, చరిత్రా, పురాణేతిహాసాలు చెప్తున్నారుట. వీళ్ళకి చదువు మీద కించిత్తు కూడా ధ్యాసలేదు కాబట్టి, వీళ్ళు శాశ్వత విద్యార్థినులవడం వల్ల ఈ కార్యక్రమం నిరా ఘాటంగా జరిగిపోతుంది. రాను రాను ఈ విద్యార్థినుల ప్రాముఖ్యత కూడా పెరుగుతూ వొచ్చింది. మహిళామండలిలో రెండేసి సంవత్సరాలకోసారి కార్య కర్తల ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నిక సంరంభంలో సభ్యుల్ని గురించి

ప్రచార దుష్ప్రచారాల్లో ఈ పనిమనుషులు ప్రముఖ పాత్ర వహిస్తారు. క్రిందటి సారి ఎలక్షన్లలో మా ఆవిడ సెక్రటరీ అవ్వడానికి ప్రత్యర్థి అయిన నాగరత్నం మీద సత్తెమ్మ చేసిన దుష్ప్రచారమే అంటారు.

''మరింకో పనిమనిషిని చూశావా?'' అని అడిగేను. ఓ మనిషిని బర్తరఫ్ చేసి మరో పనిమనిషిని కుదుర్చుకునే మధ్య వ్యవధిలో మా ఆవిడ అగ్నిపర్వతం లాగా పొగలూ శగలూ కక్కుతూ వుంటుంది.

"నాగరత్నంగారింట్లో పన్జేస్తున్న మంగమ్మ చాలా నీట్‌గా చేస్తుందిట. పది రూపాయలెక్కువయినా సరే దాన్నే కుదుర్చుకుందామనుకుంటున్నాను'' అంది. ఆ నాగరత్నం భర్త వెంకట్రావు నా కొలీగ్. కిందటిసారి ఎలక్షన్లలో వాళ్ళావిడ ఓటిపోయాక పదిహేను రోజుల వరకూ నాతో మాట్లాడ్డానికే సిగ్గు పడేవాడు.

సాయంత్రం క్లబ్‌కని బయల్దేరి వెడుతుండగా దార్లో వెంకట్రావు కన బడ్డాడు. వాడెప్పుడూ నాకంటే ముందే క్లబ్బుకి బయల్దేరేవాడు. ''ఏరా, ఇంత లేటయిందివ్వాళ?'' అని అడిగేను.

''ఇప్పటివరకూ పనిమనిషి నానాగొడవా చేసి ఏభయిరూపాయిలు గుంజుకు పోయింది. పోతేపోయిందికాని శని విరగడైంది. పద పోదాం' అన్నాడు.

''ఎవరా పనిమనిషి?' అని అడిగేను మనసులోని కీడు శంకిస్తూ.

''మంగమ్మనే బ్రహ్మరాక్షసి. అదేమో సి.పి.ఐ. దాని అన్నగారికిక్కడో కూరల బండి వుంది. వాడు సి.పి.యం. దాని మొగుడు డిస్మిస్డ్ పోలీస్ కాన్ స్టేబుల్. వాడు పగలు కాంగ్రెస్ ఐ; రాత్రి తాగొచ్చాక 'తెలుగుదేశం.' దాన్నో మాటంటే అన్ననీ మొగుణ్ణీ పంపించి పంచాయితీ పెట్టిస్తుంది' అన్నాడు. నా మనస్సులో భయం ఘనీభవించింది. ఏం లాభం! స్వానుభవం వల్లకాని తత్వం బోధపడదు మా ఆవిడకి.

ఒక దుసంఘటన జరగవల్సున్నప్పుడు దాని తాలూకు దుశ్శకునాలు దశరథుడికీ, అభిమన్యుడు యుద్ధానికి బయల్దేరేముందు ఉత్తరకీ, సీజర్ సెనేట్‌కి ముంగానే కన్పిస్తాయంటాడు. సీతా కళ్యాణమై అయోధ్యకి తిరిగొస్తున్నప్పుడుదు

వెళ్ళేముందర కాలిఫోర్నియాకి ఎన్నో అపశకునాలు కనబడ్డాయిట. వాళ్ళు ఖాతరు చెయ్యలేదు. ఫలితం ఊరికే పోతుందా?

మొన్న భూకంపం, నిన్న మా పక్క కాలనీలో బందిపోట్లూ, ఇవ్వాళ పనిమనిషిని గురించి విన్న వివరాలతోనూ మనస్సు పరి పరి విధాల పోయిం దేమో. రాత్రి ఒకటే కలత నిద్ర! ఎందుకో రాత్రి గబుక్కున మెళుకువొచ్చింది. గది గుమ్మంలో బాకులు చేతుల్లో పట్టుకుని ఇద్దరు మొగాళ్ళూ, మధ్యన మా పనిమనిషి మంగమ్మ ప్రత్యక్షమయ్యేరు. వాళ్ళు నెమ్మదిగా అడుగులేసుకుంటూ మావైపే వొస్తున్నారు. గట్టిగా అరుద్దామనుకున్నాను నోరు పెగల్లేదు. గబుక్కున వెనక్కి తొర్లేను. ''అబ్బ! చంపేశారండి! ఒళ్లు హూనమైపోయింది .... అదేమిటీ, పూనకమొచ్చినట్టు ఆ మొహం మీరూను ' అంటూ మా ఆవిడ లేచి కూర్చుంది. గుమ్మంకేసి బెదురు చూపులు చూస్తూ "అదేదీ .... దొంగమ్మ!'' అన్నాను, మాటలు తడబడుతూ. నా మొహంకేసి తేరిపార చూసి "ఆ పూనం దేవో దుర్గాదేవో కల్లోకొచ్చుంటుంది. కళ్లు మూసుకుని అంజనేయ దండకం చదువుకోండి'' అంది మా ఆవిడ.

మనిషిని నీడలా వెంటాడుతూ అనుక్షణం మృత్యువువైపు నెట్టే బ్రహ్మ రాక్షసెవరంటే — వయస్సు. మృత్యువుకంటే భయంకరమైనది వృద్ధాప్యం. వృద్ధాప్యం కంటే దుర్భరమైంది యాభయ్యోపడి. భార్య మాట వినదు, పిల్లలెదురు తిరుగుతారు, స్నేహితులు పల్చబడతారు, పలుకుబడి తగ్గుతుంది, సమస్యలు పెరుగుతాయి, ఓపిక తరుగుతుంది సుఖశాంతులు కరువవుతాయి, పొగడ్తకు మొహం వాస్తాము, భవిష్యతంటే ఆందోళన, సందేహాలు, భయం. రోజులు మనవి కానప్పుడు తాడే పామై కరుస్తుందంటారు. అంచేత నా జాగ్రత్తలో నేనుంటూనే వుంటాను. పొద్దున్నే లేచి బాత్రూంలోకి వెళ్ళబోతూ అడ్డంగా స్టూలుమీద కూర్చున్న మా ఆవిడ బుజంతట్టి కాస్త తప్పుకో అన్నాను. "ఏమిటయ్యోయ్ మీద సెయ్యేత్తన్నావ్!'' అన్న అపస్వరం వినబడగానే మరి కళ్ళజోడెట్టుకుని, నైలాన్ చీర కట్టుకుని కుర్చీ పీటమీద ఠీవిగా కూర్చున్న వ్యక్తి ఎవరా అని కాస్త పరకాయించి చూస్తుంటే ఎడమ కన్నదిరింది. దాంతో కన్ను కొట్టేనని తారాజువ్వలా లేచినది మా కొత్త పనిమనిషి మంగమ్మేనని యిట్టే గ్రహించాను.

నే సంతటి మొగాణ్ణికాదని మా ఆవిడ హామి ఇచ్చిన మీదట గ్రహం శాంతిం చింది.

మంగమ్మ పనిలో చేరేక మా ఆవిడకి మనశ్శాంతి మరింత దూరమైంది. వారానికొకటి రెండురోజులైనా పని ఎగ్గొట్టేస్తుంది. గిన్నెలూ, బట్టలూ యధా ప్రకారం అంతర్ధాన మౌతున్నాయి. పైగా, దాని నోరుకూడా వాడి. అన్నింటి కంటే ముఖ్యమైన కారణం మరొకటుంది. మంగమ్మ మంచిదని నమ్మించి పన్లో పెట్టుకోమని ప్రోత్సహించడం నాగరత్నమ్మతో కుమ్మక్కయిన ప్రతిపక్షాల కుట్రవల్ల జరిగిందట. దానికి తార్కాణంగా ఆ మర్నాడే బంగారం లాంటి సత్తెమ్మ నాగరత్నమ్మ యింట్లో చేరిందట. దానికి సాయం యిదంతా తన పన్నాగమేనవి ఆవిడెళ్ళి సభ్యులందరి చెవిలోనూ కోడై కూస్తుందట. దానా దీనా మా ఆవిడకి బ్లడ్ ప్రెషర్ పెరిగిందంటే ఆశ్చర్యమేముందీ!

ఉదయం తల దువ్వుకుంటూ అద్దంలో చూస్తుండగా అప్రయత్నంగా నా దృష్టి మంగమ్మ ప్రతిబింబం మీద పడింది. అటూ ఇటూ దిక్కులు చూస్తూ ఏదో చీర చెంగుచాటున దాచుకుని గబగబ మెట్లు దిగుతోంది. అనుమానం వేసి పిల్లిలా అడుగులేసుకుంటూ బాల్కనీ అంచుకెళ్ళి ముందుకు వొంగి కింద సందు లోకి చూశాను. ఓ స్టీలు గిన్నె తన సంచిలోకి దోపేసి పైన చక్కగా ఏవో గుడ్డల మడతలతో కప్పేసింది. 'చాలా నీట్‌గా పని చేస్తుందని' మా ఆవిడకి చెప్పేరుట, అదేనేమో! నేను వెంటనే వెళ్ళి మా ఆవిడ చెవిలో వూదేను మంగమ్మ పైకొచ్చింది. మా ఆవిడ కిందకెళ్ళి ఆ సంచీ పైకితెచ్చి మంగమ్మ కెదురుగా దాంట్లోంచి మెజీషియన్లాగా గిన్నె పైకి లాగింది. ఇదంతా చూస్తూ, ఏమీ చూడ నట్టుగా నటిస్తూ మంగమ్మ స్టూలుమీద కూర్చుని అంట్లు తోమడంలో నిమగ్ను రాలైంది.

''గిన్నె చూశావా? ఇదిగో మా పేరు. నీ సంచిలోకెలా వెళ్ళింది?'' అంటూ మా ఆవిడ నిలదీసి అడిగింది.

''నేనే సంచిలో ఎట్టుకున్నాను. అది మీ గిన్నయితే యిది మా గిన్నయి వుంటాది'' అంటూ ఇంచుమించు అలాంటిదే తన కుర్చీపీట పక్కనున్న గిన్నె తీసి చూపెట్టింది. మా ఆవిడ ఆ గిన్నెతీసి చూసి నిర్ఘాంతపోయి అక్కడే పెట్టేసింది

మంగమ్మ తటాల్న లేచి, మా ఆవిడ చేతిలో వున్న సంచీ లాక్కుని, సగం తోమిన అంట్లు అలాగే వొదిలేసి చెయ్యి కడుక్కుని, సంచీలోని నేప్‌కిన్‌తో చెయ్యి తుడుచుకుని, మా ఆవిడ మొహంకేసి, కిటికీలోంచి చూస్తున్న నా మొహంకేసి చుర చుర చూసి మాటామంతీ లేకుండా వెళ్ళి పోయింది.

నేను అఫీసుకు బయల్దేరదామనుకుంటుండగా మాసిపోయిన కాకీ చొక్కా నిక్కర్లు తొడుక్కున్న ఓ నలభయ్యయిదేళ్ళ ఆసామీ, లాఠీ కర్రలాంటిది చంక నెట్టుకుని ప్రత్యక్షమై "నమష్కారం సార్" అన్నాడు కుర్చీమీద కూర్చుంటూ.

"ఎవరునువ్వు!" అని అడిగేను, వాడి వాలకం, వాడు కుర్చీమీద కూర్చున్న పద్ధతి కేసి పరీక్షగా చూస్తూ.

"వన్ మినిట్" అని కిటికీలోంచి రోడ్ మీదకు చూస్తూ "రారా ఎంక టేశ్వర్లూ, అయ్య వున్నాడు" అని కేకేశాడు. ఇంచుమించు ఇలాంటి అవతారమే— ఎటొచ్చీ చారల పైజమా గళ్ళ చొక్కాలతో ప్రత్యక్షమై "గుడ్‌మార్నింగ్ సార్!" అంటూ మరో ఖాళీ కుర్చీ నధిష్టించేడు.

"మీరెవరు? ఏం కావాలి? నాకు ఆఫీసు కెళ్ళే టైమయింది. నాతో ఏం పనో తొరగా చెప్పండి" అన్నాను. చూడ్డానికి ఇద్దరూ రౌడీల్లా వున్నారు. కుర్చీలో కూర్చున్నానన్న మాటేగాని కాళ్ళలో వొణుకు పుట్టింది.

"నా పేరెంక టేశర్లండి. ఈ కాలనీలో కూరల బండి తిప్పుకుంటా యాపారం సేసుకుంటానండి. ఈడి పేరు ఈర్రాజండి, మీ ఇంట్లో పన్జేసే మంగమ్మ పెనిమిటండి. మంగమ్మ మా సెల్లెలండి. మీరు మరీ బిజీగా వుంటే మరికోపాలి సాయింత్రం...."

"సరే, తొందరగా చెప్పండి" అన్నాను, మళ్ళీ సాయంత్రం వీళ్ళు మా గృహం పావనం చేసే ప్రమాదాన్ని తప్పిద్దామని.

"మా యావిడ మంచి మనిషినేకందా యెంకట్రావు గారింట్లో మానేసి మా యింట్లో పన్జెయ్యి, మరో పది రూపాయి లెక్కువిత్తానని సెప్పి మీ వైఫ్ గారు కుదుర్చుకున్నారు! మీరూ మర్యాదయినోళ్లే కందా అని మా యావిడ సేరింది. సేరిన రోజు పొద్దున్నే మా యావిడ బుజం తట్టి కన్నుగొట్టేరు" అన్నాడు మంగమ్మ మొగుడు వీర్రాజు. వీడు డిస్మిస్డ్ పోలీస్ కానిస్టేబులని వెంకట్రావు చెప్పేడు.

"తెల్లారగట్ట మసగ చీకట్లో నేను కళ్ళజోడెట్టుకోకపోవడంవల్ల అలా జరిగిందని అనాడే చెప్పేను" అన్నాను.

"సెబితే సరిపోద్దాండీ? ఇయ్యాళ పొద్దుగాల మా యావిడ మీద దొంగ తనం కట్టి సంచీ సెర్చి సేశారంట. మా యావిడసలే అభిమానంతో సచ్చే ఆడది. ఇంతవమానమైపోయాక బతుకెందుకని, గుడిశెలోకి రాగానే వొంటి మీద కిరసనాయిలు పోసేసుకుని అగ్గెట్టేసుకుంటుంటే సటుక్కున అగ్గిపెట్టె లాగేసు కున్నానండి. మరి నేనో చెనం లేటయితే మరి మా యావిడి సూసైడయి పోనాండి?"

"కళ్ళముందరే మా గిన్నె పట్టుకుపోతుంటే వెతికి పట్టుకోకుండా వొదిలేస్తామా?"

"వొదిలెయ్యకూడదండి. మనిషిని పట్టుకోండి. కాని సెర్చి చేయడానికి మీకు పవర్సు లేవండి. మీరు పోలీసు రిపోర్టియ్యాల పోలీసొచ్చి పంచనామా జరపాల. ఆళ్ళు సెర్చిచెయ్యడానికి పవర్సున్నాయండి. ఆళ్ళు గిన్నె తీసి దాని మీదున్న ఫింగర్ ప్రింట్లు తీత్తారండి. అదండి రూల్సు. మీరు సెక్షన్ నైన్టీ ఎయిట్ సి.ఆర్.పి.సి., సదవండి తెల్సుద్ది" అన్నాడు డి.పో.కా. వీర్రాజు.

"ఇదిగో, పొద్దున్నే ఆఫీసుకెళ్ళే టైమ్‌లో ఏమిటీ గొడవ? మీ గిన్నె మీరట్టుకుపొండి. మంగమ్మ ఈ నెలలో వారం రోజులు పన్జేసింది. ఇదిగో, ఈ పదిహేను రూపాయిలూ తీసుకెళ్ళండి. ఇంకా పిచ్చిపిచ్చి వేషాలేస్తే డి.యస్.పి., శేషగిర్రావుకు ఫోన్ చేస్తాను. వాడొచ్చి సెటిల్ చేస్తాడు."

"సిత్తం. ఇవి కూడా తనదగ్గిరే వుంచండి. ఆ డి.యస్.పి.గారు రాగానే కబురెడితే వొస్తామండి" అన్నాడు మం. మొ. బంకలాగ.

"సూడండి బాబూ! రెండు నిమిషాలీడింటికెళ్ళడం లేటయితే మంగమ్మ వొళ్ళు కాల్సుకు సచ్చిపోయేదండి! అంత సీకటి పొద్దుటేల తవరో మనిషిని జూసి ఓ మనిషనుకున్నారు గందా! మరి అది ఓ గిన్నె సూసి ఓ గిన్నె అనుకో కూడదా బాబూ? అంతా దాని గెహశారం. అసలే అగ్గిలాంటి ఆడది. ఆ అవమా నంతో దాని పాణం కుతకుతలాడిపోనాది. పాపం, కిరసనాయిలోసుకుని...." అంటూ దాని అన్నగారు వకాలత్ పుచ్చుకున్నాడు, పొడి కళ్ళు తుడుచుకుంటూ.

"చూడు, వెంకటేశ్వర్లూ! ఇంకా అర్గ్యుమెంట్లు అనవసరం. నేనాగిన్నె చూడకపోతే, పైనున్న తన గిన్నెలో ఏకూరో పులుసో వేసుకుని, 'అమ్మా, యిది

నా గిన్నే చూసుకోండ'ని చెప్పి పట్టుకుపోను. మా గిన్నె సంచితోటే వెడుతుంది" అన్నాను.

"మీరనుకుంటే సరిపోద్దాండి? దానికెపిడెన్సుండొద్దండీ?" అన్నాడు మంగమ్మ మొగుడు ఖసగొడ్తూ.

"ఈ(రాజా! నువ్వు నోరుమూసుకో. మీరు సెప్పిందే రైటు. ఇంక అర్గు మెంట్లెందుకండి? ఓ రెండొందలాడి మొకాన్న పాతేసి సెటిల్మెంట్ సేసి పారె య్యండి..."

"రెండు వందల రూపాయిలా! నాన్‌సెన్స్! ఇదిగో, ఓ నెల జీతం అరవై రూపాయిలిస్తాను తీసుకో. మరో యింట్లో పనికుదరటానికి టైం పట్టినా యిబ్బం దుండదు" అంటూ ఓ అరవై రూపాయిలు మళ్ళీ పడేశాను.

"సూడండి, తవరు గవర్నమెంటాఫీసరు. పెద్ద జీతం, లంచాలూ, మామూళ్ళూ. వైటూ బ్లాకు వుంటాయండి! మాకేటుంటాయండీ? రెక్కాడితే దొక్కాడదద్ది. కడం నూటపాతిక యిప్పించెయ్యండి. అది పెళ్ళానికి గండం గడిసింది, తమకీ పరువు నిలబడింది...." అంటూ మళ్ళీ గీతోపదేశం ప్రారం భించేడు, అరవై జేబులో పెట్టుకుని.

"పొద్దున్నే యింటికొచ్చి ఏమిటీ అల్లరి? చేసింది దొంగతనం పైగా, ఈ సతాయింపు! నేనింకొక్క పైసా యివ్వను" అన్నాను. వెధవ బ్లాక్ మెయిలింగూ వీళ్ళూను!

"ఇవ్వనంటే ఎలా కుదురుద్దండీ? మీ కుటుంబం మూలాన్న మా కుటుంబం అన్యాయమైపోయింది. ఒక కేసా రెండు కేసులా! మానబంగం, అవమానం, సూసైడూ! ఇయన్నీ కాలనీ వోళ్ళకి తెలుస్తే....తవరా గవర్నమెంటాఫీసరూ.... మీ వైఫ్‌గారా ఆడోళ్ళ సంగానికి సెక్రటీ...."

నా దగ్గిర నూటేభయి రూపాయిలు పిండేసి పైగా బెదిరింపులూ కారు కూతలూ కూసి పోయేరు ఆ యమకింకర్లిద్దరూ. ఇదంతా హాల్లో కూర్చుని వింటున్న మా ఆవిడ "ఏవండీ! ఈ కాలనీ వాళ్ళకో దణ్ణం, ఈ మహిళా మండలికో దణ్ణం, ఈ పనిమనుషులకో దణ్ణం. మీరు వెంటనే మరో కాలనీలో యిల్లు చూడండి'' అంది.

*

('ఆంధ్రభూమి' సచిత్ర వారపత్రిక, 9-8-'84)